# రామి

పల్లె ప్రాంతము. పాతిక, ముప్పై ఇళ్లకు మించని ఊరు. ఊరికి నడుమ వెళ్లే రహదారి. రహదారికి అటువైపు, ఇటువైపు వరుసతప్పని ఇళ్లు. ఇంటికి ఒకసోఫా—సోఫాలో లోక అరుగు—లోక అరుగుమీది స్థంభాలు ఇంటికప్పుకు ఆధారము—అరుగు ప్రక్కనే రోలు. రోకలి—మూడునాలుగు రోకళ్లు. ప్రతీఇంటికి ఇది ఒక ఆనవాయితి.

అదిగో! ఊరికి చివరఉన్నది అదే రామి—వీరాసామి ఇల్లు. అక్కడ నిలబడి చూస్తే పైరు పచ్చదనం, నింగియొక్క నీలిమ కన్పిస్తాయ్. పున్నమివెన్నెల్లో రామి వీరాసామి వారి ఇంటి లోక యరుగు మీద కూచొని వూసులాడుకుంటారు. పచ్చని పంటచేలమీదుగా వీచేగాలి వన్నెగాలుల నాస్వాదించి, మత్తెక్కి మన్మథోన్మాదముల తేలి యాడుతారు. ఆకాశంలో మెరిసే మిణుకు, మిణుకుమను నక్షత్రాల కాంతి. చంద్రుని నుండి వచ్చువెల్లని వెన్నెలలు వాతావరణంలో వేడిని పుట్టిస్తాయ్. మైమరచిపోయి రామి వీరాసామి ఏకమై పోతుంటారు.

ఆరోజు————

రామి చూస్తుంది.

తీర్చిదిద్దిన కనుబొమ్మలు—కోటేరు వేసినట్లున్న ముక్కు—చిన్ననోరు ఎరుపును ధిక్కరించే పెదిమలు, గులాబీ రేకుల్లాంటి చెక్కిళ్ళు, తుమ్మెద రెక్కల్లాంటి వినీల కుంతలాలతో వేయబడిన జడ—జడను సవరించుకొనుచున్న వేళ్లు—అవి పొలము పనిలో రాటుదేరి, వీరాసామి సరససుందర వీణను మీటగల సుతిమెత్తనివై మనోహరమై వున్నాయ్.

అవి రామితీరు—అందమనే పదానికి నిర్వచనాలు ప్రకృతి పులకలతోపాటు ఆమెలో ... గోచరిస్తున్నాయ్. కండ్లలో ... కుంచించుకు పోవటాలు అనూహ్యంలో ... పసిగట్టవచ్చు.

వర్షము వచ్చేట్టుంది. మేఘాలు ఆకాశాన్నంతటిని కప్పివేస్తున్నాయ్. అవి ఒకదానినొకటి ఢీకొని ప్రళయ భయంకరంగా ఘర్జిస్తున్నాయ్. ఒకదానినొకటి రాసుకొని, ఆ రాపిడి వలన కలిగిన వెలుగుతో లోకాన్నంతటిని ప్రకాశవంతంగా చేస్తున్నాయ్. సాయంత్రము అయిదు గంటలైనా అస్తమించు సూర్యుని చూచుటకు వీలు లేకుండా మేఘములు గాఢముగా క్రమ్ముకొని, ప్రకృతిని భీకరంగా చేస్తున్నాయ్.

ఒకపిల్లగాలి చల్లగా మెల్లగా వీచింది.

వర్షము ప్రారంభమైంది. మొదట పెద్ద పెద్ద చినుకులు బాజా భజంత్రీలు వాయించుకుంటూ, ఎవరో తమ్ము పెన్నాడుతూన్నట్లు పెద్ద పెద్ద అంగలతో ఉరుకులెత్తాయ్. చిటపటమంటూ దారినవున్నవారి వీపులమీద ప్రోగాయ్. కొద్దిసేపటిలో చినుకుల పైజు ... వేగం హెచ్చిపోయాయ్. భూమికి ఆకాశానికి వంతెనవేసినట్లుయింది.

ప్రారంభించి అయిదు నిమిషములుకాలేదు అప్పుడే భూమి నీటితో దోబూచులాడటము సాగించింది. వర్షపునీరు—నేల బలాబలాలు చూసుకోవడం మొదలుపెట్టాయ్. అంతకు రెండురోజుల క్రితమే వర్షము కురిసింది. కాబోలు! పైనుండి సంతత ధారగా వస్తున్న నీటిని త్రాగలేకపోయింది భూమి. నీటిదెబ్బ తిన్నది. భూమి అదుపు తప్పి పోయింది. వర్షపునీరు జాలుగా, వాగుగా ఏరులద్వారా ఎక్కడికో ప్రయాణము కట్టింది. బహుశా ఆనీరంతా అనంతసాగర సమ్మేళనం చేసుకొనిపోతుంది. ఈ వర్షానికి ఎంత హంగామా చేసింది! ఉరుములతో మెరుపులతో ప్రళయాన్నే సృష్టించింది.

రామి తదేకంగా చూస్తోంది————

"అమ్మో, ఎంత పెద్దవర్షం" అనుకుంది. వీరాస్వామి మనసులో మెదిలాడు. అతని ఆకారం దాని హృదయంతో దోబూచులాడింది. "నా వీరాసామెంత సొగసుకాడు" అనుకొందొకసారి

## జె. ప్రకాష్

... వేసుకొని పెదవులమీదొక చిరునవ్వు చిలికించింది. సిగ్గుతో బుగ్గలు సొట్ట పడ్డాయ్. అదిమరింత వెలుగునిచ్చింది రామికి.

రామెప్పుడూ వీరాసామితో పాటు పొలానికి వెళ్లేది. వీరాసామికి ప్రతిపనిలోనూ తలలోని నాలుకలామెలిగేది. రోజులాగే ఈ పూట తాను వస్తానంది పొలానికి. వీరాసామి అడ్డుచెప్పాడు. "ముసురెట్టింది, వాన వచ్చేటట్టుంది. నీవొద్దులే, నేనే ఆకాసింతా సూసివత్తా" నంటూ వెళ్లాడు. పొద్దునసనా వెళ్లాడు. ఇంకారాలేదు. ఎందుకో ఈవాన ఇలా ముంచుకురావాలా? ... వీరాసామి—వీరాసామి అనుకోడానికి సిగ్గేసింది రామికి—తడిసిపోయాడేమో! వీరాసామి ఇక్కడుంటే ఇప్పుడెంత బాగుండేది" అబ్బ! చలిగాకూడవుంది. రామి ఒంటికి బిగువుగా పమిటె కప్పుకుంది.

చల్లని పిల్లగాలొకటి వీచింది. రామికండ్లు మిలమిల మెరిసాయ్—సంతోషం ఉరకలువేసింది. అరమూసిన కన్నులతో సంభాషి అపుచేసుకొని నిలిచిందిరామి.

వీరాసామి పొలములో నున్నాడు. వర్షమొచ్చింది. తడిసిపోకుండా వుండాలని వీరాసామి దాపునున్న గుబురు చెట్టునీడకు చేరుకున్నాడు. చుట్టూబురదనీరు పారిపోతుంది. ఆకులమీది నీరు అప్పుడప్పుడు 'టప్పుటప్పుమని" పడుతూంది. వీరాసామి పెదిమలు కొంచెము చలించాయ్. రామి ప్రక్కన ప్రత్యక్షమైంది. వీరాసామి తీయగా తనవైపోసారి చూచాడు. రామి కండ్లు మెరిసాయ్. రామి మొగముమీది ముంగురులను సరిదిద్దాడాతడు. వీరాసామి అక్కున చేరిందామె. బల్లిలా గట్టిగా గుండెలకుహత్తుకు పోయింది ఆమె.

"ఎంతబాగుంది" మురిసిపోయింది రామి. కల మారింది—రంగము మారింది.

ఉద్యానవనంలో తను నాట్యంచేస్తోంది. వీరాసామి వూడిపడ్డాడెక్కడనుండో. జల్తారు దుస్తులలో మెరిసి పోతున్నాడు. చిన్నటి పదునైన మీసం—చక్కటి సొగసైన కనుబొమలు నవ్వుతూ ఆహ్వానించే పెదాలు. అబ్బా! ఎంత అందంగా ఉన్నాడు తన వీరాసామి. ధగధగమనే దుస్తులతో, చకచక నడకలతో తన్ను చేరవస్తున్నాడు. అతన్నికలుసు కోవటానికి తనమనస్సెంత ఆతురత పడ్డది! ఆగలేక అతనికి ఎదురెళ్లింది. ఊపిరి సలపకుండా తన్ను కవుగిలించుకున్నాడు వీరాసామి. కందిపొయ్యేలా ముద్దెట్టాడు. అబ్బా! రామి బుగ్గ నిమురుకుంది.

ఉలిక్కి పడింది రామి—ఉరుమొకటి ఉరిమింది. మెరుపొకటి మెరిసింది. రామి మనసులో గుబులు రేగింది.

వీరాసామి పొలములో పనిచేస్తున్నాడు. ఏకధారగా వానపడుతూంది. పూర్తిగా తడిసిపోయాడు—వణుకు పుట్టుకొస్తోంది—కాళ్లు కొంకర్లు పోతున్నాయ్. రామి ఆ ప్రాంతంలోలేదు. వీరాసామి బయలుదేరాడు. మెల్లగా చెట్టు క్రిందకు చేరుకున్నాడు. ఆకాశానికి చిల్లిపడ్డట్లు వర్షము కుండపోతగా పోస్తోంది. మనిషిబాగా వంచుకుపోయాడు. మేఘాలు ప్రళయ భయంకరంగా ఘర్జిస్తున్నాయ్, కారు చీకట్లు క్రమ్ముకున్నాయ్. ప్రపంచపు పరిసమాప్తివేళ దాపురించి 'తళుక్కు' మంది మెరుపు—ఘర్జించింది మేఘము—అర్జునుని రథచక్రము ఊడిపోయింది. చీలచెట్టులోనాటింది. పెళపెళార్పులతో చెట్టుకూలింది. దాని క్రింద వీరాసామి...

చూడలేక పోయింది రామి. కండ్లు మూసుకుంది గట్టిగా. చెక్కిళ్లమీద కన్నీళ్లు దారలు కట్టాయ్. పెదవులు వణుకుతున్నాయ్. భయపడి పోయింది రామి.

వీరాసామి వీధిమొగసాలలో కన్పించాడు. దగ్గరగా వస్తున్నాడు. రామికి దుఃఖము పెల్లుబికింది. వీరాసామి దగ్గరకొచ్చాడు. రామి బావురుమంది, వీరాసామిని పెనవైచుకొని

"ఏంటే, ఏడుత్తుండావ్" ఏమీతోచక కంగారు పడుతూ అడిగాడు వీరాసామి.

"పో, బావా. ఇంతసేపటికా ఇంటికొచ్చేది" అంది. వీరాసామికి అర్ధమైంది.

"పోదూ" అంటూ త్రోసింది వీరాసామిని.